క్లుప్తంగా

డీజీపీని కలిసిన గరటయ్య



డీజీపీని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గరటయ్య

అద్దంకి రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డిని శుక్రవారం డీజీపీ కార్యాలయంలో అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బాచిన చెంచుప్రసాద్‌లు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

జే.పంగులూరు: బహిరంగ ప్రదేశాల్లో ఎవరైన మద్యం తాగితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని ఎస్సై తిరుపతిరావు అన్నారు. మండల పరిధిలోని పంగులూరు పరిసర ప్రాంతాల్లో శుక్రవారం బహిరంగంగా మద్యం తాగుతున్న మందుబాబులను ఎస్సై తిరుపతిరావు తన సిబ్బందితో పట్టుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఈమధ్య కాలంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం ఎక్కువైందన్నారు. పొలాల గట్లపై, కాలువ చప్టాలపై మద్యం తాగి అక్కడే సీసాలు పగులగొడుతూ రైతులకు ఇబ్బందులు కలగ జేస్తున్నారన్నారు. ఆ విధంగా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అద్దంకి రూరల్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సంతమాగులూరు ఎస్సై శివకుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఏల్చూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలను తనిఖీ నిర్వహించారు.

పేద ముస్లింలకు రంజాన్ సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ అనీల్‌కుమార్

చీరాల టౌన్: నిరుపేద ముస్లిం కుటుంబాలకు పద్మభాస్కర్ ఫౌండేషన్ తరపున రంజాన్ చిరు సాయాన్ని ఫౌండేషన్ చైర్మన్, వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల పాలకవర్గం సభ్యులు ఘంటా అనీల్‌కుమార్ అందించారు. శుక్రవారం పట్టణ పరిధిలోని ఎల్‌బీఎస్ నగర్‌లో ఉన్న 27 నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగ సందర్భంగా ఒక్కో పేద కుటుంబానికి రూ.500 చొప్పున ఆర్థిక సాయాన్ని అందించారు. ఈసందర్భంగా దాత అనీల్ కుమార్ మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ ఉపవాస దీక్షలు చేస్తున్న నిరుపేద ముస్లిం కుటుంబాలకు తనవంతుగా పండగ సాయాన్ని అందించినట్లు తెలిపారు.

ఆలయాల ఈవోగా నాగయ్య

యద్దనపూడి: మండలంలోని యనమదల, పూనూరు ఆలయ గ్రూపుల ఇన్‌చార్జ్ కార్యనిర్వహణాధికారిగా మల్లవరపు నాగయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జ్ కార్యానిర్వహణాధికారిగా పనిచేస్తున్న జ్యోతికుమారిని కారంచేడు రెగ్యులర్ ఈవోగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన నాగయ్య మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ ఆలయాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

కారంచేడు: సరైన పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత నుంచి బయటపడొచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ కే జెస్సీరాణి అన్నారు. శుక్రవారం ఆమె మండల కేంద్రమైన కారంచేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ హైరిస్క్‌లో ఉన్న గర్భిణులను పర్యవేక్షించి బ్లడ్‌గ్రూపులను నమోదు చేసుకోవాలన్నారు. బాలింతలకు కూడా సరైన అవగాహనలు కల్పించి మంచి ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కలిపారు చేయి.. నిలిచారు ఐక్యంగా



మార్టూరులో సరికొత్తగా ముస్తాబైన ఈద్గా

- ముస్తాబైన మార్టూరు ఈద్గా
- 30 రోజుల్లో రూ.15 లక్షలతో ముస్లింల కృషి
- నేడే పవిత్ర రంజాన్

మార్టూరు: ఎవరో వస్తారు.. ఏదోచేస్తారని ఎదురు చూస్తూ కాలయాపన చేయలేదు వారు. సాటి ముస్లింలకు తాము ఎంత చేస్తే అంతకు పదింతలు అల్లాహ్ తిరిగి ఇస్తారని నమ్మి వారంతా తలో చేయి వేసి దశాబ్దాలుగా సౌకర్యాలు లేమితో ఉన్న ఈద్గాను కేవలం 30 రోజుల వ్యవధిలో రూ.15 లక్షలు సొంత నిధులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుకున్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు పక్కన ముస్లింల పండుగలు, పర్వదినాలప్పుడు ప్రార్థనల నిమిత్తం 1987లో 0.87 సెంట్ల ప్రభుత్వ స్థలంలో ఈద్గాను నిర్మించారు. ఐతే గత 35 ఏళ్లుగా సరైన సౌకర్యాలు లేక పండుగల సందర్భంగా శుభ్రం చేసుకుని ప్రార్థనలు నిర్వహించుకోవటం పరిపాటిగా వస్తోంది. ఈ క్రమంలో గత నెల రోజుల క్రితమే పార్టీలు, పంతాలు, పట్టింపులకు అతీతంగా ముస్లింలలో ఐదుగురు సభ్యులతో కమిటీ వేసుకోవటం రూ.15 లక్షల వ్యయమవుతుందని అంచనాలు రూపొందించుకున్నారు. ఎవరి ఆర్థిక స్తోమతను బట్టి రూ.100 నుంచి రూ.1 లక్ష వరకు విరాళాలు సేకరించారు. సిమెంట్, ఐరన్, ఇసుక, ఇటుక ఇలా ఎవరికి అవకాశం ఉన్నంతలో వారు మెటీరియల్‌ను అందించటంలో పవిత్ర రంజాన్ పండుగ రోజు ప్రార్థనలు చేసుకోవటం కోసం ఈద్గా సరికొత్త రూపు సంతరించుకోవటం గమనార్హం. ఈద్గా స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం, రెండు వైపులా గేట్లు, భక్తులు కాళ్లు చేతులు శుభ్రపరచుకోవటం కోసం నీటి వసతి ఏర్పాటు చేసుకున్నారు. భారీ విరాళాలు ఇచ్చిన దాతల వివరాలు అడగగా అలా అవసరం లేదని ముస్లింల ఐకమత్యానికి ఇది నిదర్శనమని తప్ప పేద గొప్పలు తారతమ్యాలకు తావు లేదని కమిటీ సభ్యులు చెప్పటం వారి విశాల దృక్పథానికి నిదర్శనం. స్థానిక బిస్మిల్లా టెంట్ హౌస్ వారు భక్తులు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న టెంట్ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.



కొణిదెనలో ఈద్గాను అలంకరిస్తున్న పెద్దలు

ఈద్గాల ముస్తాబు..

బల్లికురవ: రంజాన్ వేడుకలకు శుక్రవారం మండలంలోని ఈద్గాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. కొణిదెన చెన్నుపల్లి, ముక్తేశ్వరం, వైదన, కొప్పరపాడు, కొమ్మినేనివారిపాలెం, వల్లాపల్లి, అంబడిపూడి, గుంటుపల్లి, మల్లాయపాలెం, ఉప్పుమాగులూరు గ్రామాల్లోని ఈద్గాలతోపాటు మసీదులను ముస్తాబు చేశారు. శనివారం జరిగే రంజాన్ శుభాకాంక్షలు తదుపరి దానధర్మల తదుపరి ముజావర్‌ల ఆధ్వర్యంలో జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొననున్నట్లు ముస్లిం పెద్దలు తెలిపారు.

ప్రజా ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యత



కొణిదెనలో ప్రభుత్వ పథకాల బ్రోచర్లు అందజేస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణ చైతన్య

- రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య
- రూ.45 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభం

బల్లికురవ: ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడం ద్వారా ప్రజల్లో ఆర్థిక శక్తి మెరుగు పడుతుందని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొణిదెన సచివాలయంలో 2వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ కూడలిలోని ఆయుర్వేదిక్ డిస్పెన్సరీ నుంచి ఎస్సీ కాలనీ వరకు రూ.45 లక్షలతో ఉపాధి హామీ పథకం, మండల నిధులతో నిర్మించిన 900 మీటర్ల సీసీ రోడ్డును శుక్రవారం చైతన్య శిలాఫలకం ఆవిష్కరణతో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ సీఎం జగనన్న సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావిస్తూ సుపరిపాలన అందిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వాలు పథకాల పేరుతో ప్రజలను మోసగించి నాయకులు పబ్బం గడుపుకుంటే జగనన్న పాలనలో లబ్ధిదారుడి ఖాతాకు నేరుగా సొమ్ము జమతో మేలు జరిగిందన్నారు. ప్రతి ఇంటికి లక్షల్లో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్న జగనన్నకు 2024 ఎన్నికల్లో మద్దతు ఇచ్చి గెలిపించాలన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల బ్రోచర్లు అందజేశారు. కార్యక్రమాల్లో బాపట్ల జిల్లా రైతు అధ్యక్షుడు, మండల కన్వీనర్ చింతల పేరయ్య, ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి, గ్రామ సర్పంచ్ కే లేపాక్షి విష్ణు, మాజీ జెడ్పీటీసీ తన్నీరు ఏడుకొండలు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కుంచపు రాఘవరావు, స్థానిక నేతలు కల్లి అంజనీ ప్రసాదరెడ్డి, దివ్వా రామాంజనేయులు, గుంజి ఆంజనేయులు, షేక్‌జాన్, చింతల శ్రీనివాసరావు, టి నరేష్, ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, ఈవోఆర్డీ సీతామహాలక్ష్మి, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈలు హనుమంతరావు, దుర్గా రమేష్, గిరినాయక్ వెలుగు ఏపీఎం సురేంద్రబాబు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సొసైటీల అభివృద్ధి



ఆమంచితో పూనూరు సొసైటీ అధ్యక్షుడు, డైరెక్టర్లు



యద్దనపూడి సొసైటీ అధ్యక్షుడు, డైరెక్టర్లు

కారంచేడు: ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేసి కారంచేడు సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిద్దామని నూతన పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ కృషితో మండల కేంద్రం కారంచేడు వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన బీసీ నాయకుడు పులి గంగరాజు, డైరెక్టర్లుగా యార్లగడ్డ శ్రీకాంత్, స్వర్ణ శ్రీనివాసరావులను అధికారులు నియమించారు. అధికారుల నుంచి అందిన ఉత్తర్వులతో శుక్రవారం వారు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి రామినేని సురేష్, నాయకులు యార్లగడ్డ పాపారావు, యార్లగడ్డ కోటయ్య, రావెళ్ల వెంకటేశ్వరరావు, దగ్గుబాటి సుధాకర్, పోపూరి సదాశివరావు, బోయిన హరిలు అభినందనలు తెలిపారు.

పూనూరు, యద్దనపూడి సొసైటీల అధ్యక్షుల నియామకం..

యద్దనపూడి: మండలంలోని పూనూరు, యద్దనపూడి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) అధ్యక్షుడిగా పావులూరి శ్రీనివాసరావు, యద్దనపూడి అధ్యక్షుడిగా పెరవల్లి శ్రీనివాసరావు నియమితులయ్యారు. శుక్రవారం పందిళ్లపల్లిలోని నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ క్యాంప్ కార్యాయలంలో డైరెక్టర్లతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమంచి మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి కృషి చేస్తూ సొసైటీల అభివృద్ధికి పాటుడాలని సూచించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు దుగ్గినేని కోటేశ్వరావు, ఈదర చలమారెడ్డి, మానుకొండ శ్రీనివాసరెడ్డి, గుంజి పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.



బాధ్యతలు తీసుకుంటున్న గంగరాజు, శ్రీనివాసరావు

విద్యుదాఘాతంలో ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న రూరల్ ఎస్సై జనార్దన్

చీరాల టౌన్: అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోవడంతో పాటుగా చేనేత వృత్తి చేసుకుని జీవిస్తూ ఇల్లు కట్టుకునేందుకు దాచి ఉంచిన నగదు అగ్నికి ఆహుతై రోడ్డున పడ్డారు. ఈ ఘటన మండలంలోని ఈపురుపాలెంలోని సత్రంబజారులో జరిగింది. చేనేత కుటుంబానికి చెందిన భవానీ పూరింట్లో ఉంలూ రూపాయి రూపాయి కూడబెట్టుకుని ఇల్లు కట్టుకుందామని రూ.10 లక్షలు దాచుకున్నారు. గురువారం సంభవించిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఇల్లు మొత్తం వ్యాపించాయి. ఈఘటనలో ఇంట్లో దాచుకున్న లక్షల నగదు, బంగారు వస్తువులు, ఇంటి డాక్యుమెంట్లు, పింఛన్ పుస్తకం, ఇతర ముఖ్యమైన పత్రాలు అన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలార్పివేశారు. రూరల్ ఎస్సై జనార్దన్, సిబ్బంది పరిశీలించి కేసు నమోదు చేశారు. అయితే కాలిపోయిన నగదులో కొన్ని నోట్లకు సీరియల్ నంబర్ ఉండటంతో వాటిని బ్యాంకులో మార్పిడి చేసుకునేందుకు బ్యాంకు అధికారులు అవకాశాన్ని కల్పించారు.

ఆమంచిని కలిసిన జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యుడు



ఆమంచిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కట్టా

చినగంజాం: జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కట్టా శ్రీనివాసరావు శుక్రవారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్‌ను ఆయన గృహంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించారు. ఈయనతో పాటు పాల్గొన్న దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు, మాల మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండమూరి ప్రకాష్ మాట్లాడుతూ విద్యావేత్త, న్యాయవాది, పార్టీలకు అతీతంగా పనిచేసే శ్రీనివాసరావుకు పదవి ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాలభేరి జాతీయ అధ్యక్షుడు చప్పిడి ప్రియతం, బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గ మాల యువసేన కన్వీనర్ సురేష్, యానాది మహానాడు జిల్లా అధ్యక్షుడు తలపుల శ్రీనివాసరావు, చీరాల నియోజకవర్గ మాల యువసేన కన్వీనర్ రూబెన్స్, రాజ్ తదితరులు పాల్గొన్నారు.

థ్యాంక్యూ సీఎం కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల: చీరాల మండలం రామకృష్ణాపురంలో శుక్రవారం చీరాల నియోజకవర్గ నాయీ బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈనెల 25న తాడేపల్లిలో జరగనున్న థ్యాంక్యూ సీఎం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కామాక్షి కేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ తాడివలస దేవరాజు, మాచవరపు వెంకటేశ్వర్లు, ఆతిన బోసుబాబు, వల్లూరి వెంకటస్వామి, వల్లూరి శ్రీనివాసరావు, మేడిశెట్టి సత్యనారాయణ, కె.సత్యనారాయణ, కె.శివ, వీ.వెంకటసుబ్బారావు, పీ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలతో లబ్ధి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

- నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

చీరాల: లబ్ధిదారుల ఇంటికి నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి చీరాల మండలం రామకృష్ణాపురం-1 సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదో అని వాటిపై ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ప్రజలకు సమస్యలేమైనా ఉంటే వాటిని కూడా సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నవరత్నాల పథకాలను అర్హులందరూ సద్వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి వ్యక్తికి జవాబుదారీగా ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచిన అన్ని హామీలను 95 శాతం మేర అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నేతాజీ, ఏపీఎం సుబ్బారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ జైసన్‌బాబు, డాక్టర్ జీ.సుబ్బారావు, మాజీ సర్పంచ్ ఎం.సత్యం, ఎంపీటీసీ గోలి నాగరాజు, కేబుల్ కృష్ణ, గుర్రం బుజ్జి, దివి జయరావు, గిరిష్, పి.కోటయ్య, కత్తుల దుర్గారావు, షేక్ మస్తాన్, యాతం మేరిబాబు, పి.చంద్రమోహన్, బుర్ల శివ, సజ్జా పవన్, గోలి రవి, మల్లెల రాజశేఖర్, బండారు జ్వాలా నరసింహం, ఆవుల అశోక్, నాదెండ్ల కోటేశ్వరరావు, బక్కా శివప్రసాద్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

'జగనన్నే-మా భవిష్యత్' కు సంపూర్ణ మద్దతు



బ్రోచర్లు అందజేస్తున్న నాయకులు

అద్దంకి రూరల్: జగనన్నే మా భవిష్యత్ కార్యాక్రమానికి ప్రజలు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని మండల జేసీఎస్ అధ్యక్షుడు ఇస్తర్ల వెంకటరావు అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని వేలమూరిపాడు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్‌లో భాగంగా ఇంటింటి తిరుగుతూ జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ జీ. అనురాధ శ్రీనివాస్, గృహసారథులు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకుడు జ్యోతి రోశయ్య, గ్రామ సర్పంచ్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణమోహన్

యద్దనపూడి: మతసామరస్యానికి, దానధర్మాలకు ప్రతీక రంజాన్ పండుగని మాజీ ఎమ్మెల్యే, పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. మండల కేంద్రం యద్దనపూడిలో వైఎస్సార్ సీపీ నాయకుడు రావూరి వేణుబాబు ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆమంచి పాల్గొన్నారు. తొలుత మసీదుకు చేరుకొని దువా కార్యక్రమాన్ని నిర్వహించి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముస్లింలకు దగ్గరుండి వడ్డించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమంచి మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగని, కులమతాలకు అతీతంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ముస్లింలు అందరూ రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ముస్లింలు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలలో నేరుగా ప్రవేశాలు

అద్దంకి: ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని గురుకుల పాఠశాలలో మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హెచ్‌డబ్ల్యూవో నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులకు ప్రవేశ పరీక్ష రాయకుండానే ఆయా తరగతుల్లో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. మూడు నుంచి పదో తరగతి వరకు ప్రతి తరగతిలో మొత్తం 40 సీట్లు ఉండగా ఎస్టీ-32, ఎస్సీ-5, బీసీ-2, ఓసీ-1కి కేటాయించారు. నాలుగో తరగతిలో ఎస్టీ-36, ఐదో తరగతిలో ఎస్టీ-35, ఆరో తరగతిలో ఎస్టీ-31, ఏడో తరగతిలో ఎస్టీ-28, ఎనిమిదో తరగతిలో ఎస్టీ-26, పదో తరగతిలో ఎస్టీ-21 ఖాళీలు ఉన్నట్లు ఆయన తెలిపారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో విద్యాగణపతి

వేటపాలెం: స్థానిక బీబీహెచ్ కళాశాల్లో రోడ్డులోగల విద్యాగణపతి ఆలయ ఆరో వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి సుప్రభాత సేవ, గణపతి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. లక్ష్మీగణపతి నవగ్రహ హోమం చేసి పూజలు నిర్వహించారు.

నేటి నుంచి వైష్ణవాలయ వార్షికోత్సవం..

కారంచేడు: ఈ నెల 22వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మండల కేంద్రం కారంచేడు రెండు చెరువుల మధ్యన కొలువైన వైష్ణవీ దుర్గాలయంలో 22వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ, ఆలయ ధర్మకర్తలు తెలిపారు. 22న హరిద్రా లంకరణ, 23న కుంకుమ అలంకరణ, 24న చందన అలంకరణ, 25న భస్మం అలంకరణ, 26న వర్ణ అలంకరణ, 27న దుర్గ అలంకరణ, 28, 29న గాజుల అలంకరణ, 30న పూలంగి సేవ, ఊంజల సేవలను ఘనంగా జరిపిస్తామన్నారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.



హోమం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు